# నేను విన్న ఆకాశవాణి (నాటికా) కార్యక్రమాలు

రచన:- శ్రీ రోహిణి

డిసెంబరు 20 రాత్రి 8 గంటలకు మద్రాసు కేంద్రంనుంచి శ్రీ కొడవటిగంటి కుటుంబరావు రచన 'గ్రహశకలం' అనే ఊహాచిత్రం ప్రసారమైంది. నిర్వహణ 'ఉష'. ఊహ, చిత్రణ కూడా బాగున్నాయి. గ్రహశకలాన్ని భూమిగాను. భూగ్రహ మానవుల్ని సూర్యగోళ మానవులుగానూ ఊహించుకోవచ్చు. ప్రసారం సాంకేతికంగా చాలా బాగుంది.

డిసెంబరు 22 రాత్రి 9-30 కు శ్రీ బందా కనకలింగేశ్వరరావు రచన 'ఒకే కుటుంబం' విజయవాడనుంచి ప్రసారమైంది. ఇతివృత్తానికి అంతగా అనువుగా కథ నడవకపోయినా ఫరవాలేదు అన్నట్లుగా ఉంది.

డిసెంబరు 23 రాత్రి 9-15 కు హైదరాబాద్ కేంద్రంనుంచి మునిపల్లె సరోజిని గారి రచన 'పోస్ట్‌మాన్' వినిపించారు. ఇది కూడా ఇతివృత్తానికి అనువుగా నడిచిన రచన కాదు. కట్నం డబ్బు ఇవ్వలేదని భార్యను పుట్టింటికి పంపకపోవడం బట్వాడా చేస్తున్న వుత్తరాల్లోని విషయాల వల్ల మనసు మారిపోవటం, తీరా అది మారిన సమయానికి బహుకుటుంబీకుడైన తమ్ముడు చచ్చిపోవడం నాటకాన్ని తికమకలో పడేసాయి.

డిసెంబరు 30 రాత్రి 9-15 కు విజయవాడ కేంద్రంనుంచి శ్రీ కపిల చినవెంకటరావు రచన 'బస్తీబావ' వినిపించారు. బందా, రామన్న పంతులు, నండూరి సుబ్బారావు వగైరా ప్రభృతులు పాల్గొన్నారు. బెంగాల్‌లో అన్నం తింటారని తెలిసి ఓ అబ్బాయి అక్కడ తనకు రొట్టెలవాడైనట్లు చెప్పే ఓ పాత్ర ధరిస్తాడు; ఆ పాత్రకు అనుగుణంగా నాటిక అందులోకి మరికొన్ని పాత్రాపాత్రలు. ఎందుకు Start అయిందో ఎక్కడికి పోతోందో తెలీకుండానే ముగింపు. నాటికలో ప్రయోజనం శూన్యం. శాస్త్రంకూడా ఒప్పుకున్న ఉత్తరాదివాని ఆహార నియమాల్ని అపహాస్యం చెయ్యడానికో నాటికను పనిగట్టుకు రేడియోలో వినిపించటం దారుణం.

జనవరి 5 కాశ్మీర్ రచయిత్రి గురించిన ఒక రూపకం 'లల్ల' లత రచన విజయవాడ కేంద్రం నుంచి వినిపించారు. నాగరత్నమ్మగారు, లక్ష్మిగారు, బందా, రామమోహనరావుగార్లు పాల్గొన్నారు. మొదటివారు 'లల్ల'గా మిగతా ముగ్గురు 'లల్లా'యి పదాల్లోని వేదాంతం ఆమెకి నూరిపోసేవారుగా బాగానే నటించారు. ఎటొచ్చీ నాటికలోనే రసపట్టులేవు.

జనవరి 6 రాత్రి శ్రీ పోరంకి దక్షిణామూర్తి రచన 'వీధి మనిషి' హైదరాబాద్ కేంద్రంనుంచి ప్రసారమైంది. ఇది మాటలతో ఏదో చెప్పాలని ప్రయత్నంచేసే లాంటి రచనే. నాటికగా రాణించలేదు.

జనవరి 10 రాత్రి 8 లకు మద్రాసు కేంద్రం నుంచి శ్రీ గొల్లపూడి మారుతీరావు రచన "ఆశయాలకు సంకెళ్ళు" శుభ గారి నిర్వహణక్రింద వినిపించారు. నాటిక అర్థం కాలేదు.

జనవరి 11 రాత్రి జాతీయ నాటక కార్యక్రమంలో "మంజరి" అనే నాటికను హైదరాబాద్ కేంద్రం నుంచి వినిపించారు మూలం ముష్టిగారు తెలుగుసేత శ్రీ దండమూడి మహేంధర్. నిర్వహణ శ్రీ స్థానం. నాటకానికున్న ఇతివృత్తం ఎందుకు పుట్టిందో అది ఎందుకు పెరిగిందో అర్థం కాదు. నాటకం బాగాలేదు.

జనవరి 12 రాత్రి మంజుశ్రీ రచన 'స్వతంత్ర జీవనం' హైదరాబాద్ కేంద్రం నుంచి ప్రసారమైంది. ఆదర్శాలనుకునే కొన్ని అపోహలతో జీవితంలోని మధుర ఘట్టాలను కొన్నింటిని జారవిడుచుకుంటారు కొందరు ఈ విషయాన్ని చక్కగా చెప్పగలిగారు మంజుశ్రీగారు. నాటిక బాగానే ఉంది.

ఒకానొక తెలుగు సినిమాలో ఒక నూతన నాట్యతారయొక్క నాట్యం అద్భుతంగా ఉన్నది అనే వినికిడి నమ్మలేక పోయాను. ఆ ఏమిటి పోమూ నాట్యం పెద్దగా బాగుండటమూ దానికోసమని ఓ సినిమా చూడటమూ ఏమిటని. తీరా ఆ సినిమా చూచాక అర్థం అయింది నాట్యం బాగుంటం అంటే ఏమిటో! తరువాత నాట్యాచార్య కోరాడ నరసింహారావుగారి డెమాన్‌స్ట్రేషన్ చూచాక నాట్యంమీద నేనేర్పర్చుకొన్న భావాలు బలపడ్డాయి. త్రాచుపాం ప్రాకినట్లు, ఆకాశంలో మెరుపు మెరిసినట్లు, కదలికలు చూపగలిగేది నాట్యం. నృత్యనాటికలలో నీళ్ళుగారిపోమే (Dragging) సంగీతానికి తావు లేదు. జనవరి 13 వనితావాణిలో ప్రసారమైన సంక్రాంతి నృత్యనాటిక వింటుంటే మధ్యాహ్నమే నిద్రవచ్చింది. ఆ రాత్రి 9-15 కు శ్రీ బందా రచన "పూటకూళ్లు" అనుశ్రుతంగా వస్తున్నకథే పాత కథ క్రొత్తరేట్లకి. వాతావరణాకి నచ్చలేదు

జనవరి 17 రాత్రి 8 గం॥కు హితశ్రీ రచన 'సవతి తల్లి' విజయవాడ కేంద్రం నుంచి ప్రసారమైంది. సవతి తల్లి అనంగానే సవతి పిల్లలను రాసి రంపాన బెట్టి కాల్చుకు తినేసే కథలే జ్ఞాపకం వస్తాయి కానీ ఈ నాటికలోని సవతితల్లి సవతి కొడుకును అతి గారాబంచేస్తుంది. అతడు చెడిపోతాడు. ఆఖరికి తండ్రి అతడ్ని ఇంట్లోంచి వెళ్ళగొడ్తాడు. వాడు వారాలు చేసుకు చదువుకుని మెట్రిక్యులేషను ప్యాసై తిరిగి ఇంటికి వస్తాడు. నాటికా రచన బాగా సాగింది. చెడిపోయిన సంతానాన్ని అంతకఠినంగా శిక్షించగలిగిన తండ్రులు అరుదు శిక్షపొందిన సంతానం నవ్యమైన త్రోవను పడటంకూడా అంతే. అద్దూ అపూ లేనివారు బాగుపడటానికంటే చెడిపోవడానికి ఎక్కువ అవకాశాలున్న ఈ కాలంలో తండ్రులు తమ కొడుకులు బాగుపడ్డానికి ఇల్లు వెడలనంపకుందురుగాక!

:o:

Source: Press Academy Website, Chukkani, Feb 1962

Disclaimer: This topic/article/write-up has been posted here to increase the availability of some rare, forgotten and precious material for appreciation by a wider audience and with no intention what so ever of copy right violation. Request for removal of any copyrighted material, by the owner, will be promptly complied with.

Maganti Vamsi Mohan
http://www.maganti.org/